సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
19వ వసంతంలోకి..
www.suryaepaper.com
EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
గురువారం
05-02-2026
పేజీలు: 02

## భయపెడుతున్న పెద్దపులి



యాదాద్రి, జనగామ జిల్లాల్లో సంచారం పలు జిల్లాల్లో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. కొన్ని రోజుల క్రితం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ ప్రాంతంలో కనిపించిన పులి , ఇప్పుడు యాదాద్రి భువనగిరి, జనగామ జిల్లాల్లో తిరుగుతూ ప్రజలను భయపెడుతోంది. గడిచిన 20 రోజుల్లో సుమారు 9 లేగ దూడలను పులి చంపి తినగా, ప్రస్తుతం జనగామ జిల్లా వాసులను భయభ్రాంతులకు గురిచేస్తుంది.


# రేవంత్‌రెడ్డి ఒక చేతగాని దద్దమ్మ..
# మండిపడ్డ హరీష్‌రావు



మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజ్ఞాపూర్‌లో మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు పర్యటించారు. అక్కడ పార్టీ శ్రేణులు నిర్వహించిన భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన అభివృద్ధిని, రేవంత్‌రెడ్డి వైఫల్యాలను ఎండగట్టారు. 'గజ్వేల్‌లో ఎన్నికలు వచ్చాయి. మనకు అన్నం పెట్టిన వాళ్లకు, మనకు పని చేసిన వాళ్లకు, మనల్ని మంచిగా చూసుకున్న వాళ్లకే ఓటేయాలి. సద్దితిన్న రేవు తలవాలి' అని చెప్పారు. కేసీఆర్ గజ్వేల్ అభివృద్ధి ప్రధాత అని హరీష్‌రావు అన్నారు. గజ్వేల్‌లో బీఆర్ఎస్‌ను మళ్ళీ గెలిపించుకోవాలని చెప్పారు. 'కేసీఆర్ రాకముందు గజ్వేల్ ఎట్లుండే..? ఇప్పుడు ఎట్లుంది..? ఆలోచించండి. ప్రజ్ఞాపూర్-గజ్వేల్ రోడ్డు అప్పుడు ఎట్లుండే..? ఆ రోజు గజ్వేల్ దవాఖాన పందులకు నిలయంగా ఉండేది. ఈ రోజు 250 పడకల ఆసుపత్రి తెచ్చి పేదలకు కార్పొరేట్ వైద్యం అందించింది కేసీఆర్. గజ్వేల్‌కు ఆర్డీవో ఆఫీస్, రైలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఊర చెరువు, పాండవుల చెరువు సుందరీకరణ చేసింది కేసీఆర్ కాదా..? కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేదింటి ఆడబిడ్డ పెళ్లికి 1,00,116 అందించి మేనమామలా ఆదుకున్నది కేసీఆర్. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవిస్తే కేసీఆర్ కిట్‌తోపాటు 13,000 అందించిన ఘనత కేసీఆర్‌ది' అన్నారు. 'మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు, బీసీ, ఎస్సీ, మైనార్టీ బిడ్డల కోసం గురుకులాలు స్థాపించి చదువుల విప్లవం తెచ్చింది కేసీఆర్. ఒకప్పుడు గజ్వేల్‌లో మూడు రోజులకోసారి నీళ్లు వచ్చే పరిస్థితి పోయి.. ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీళ్లు అందించారు. బిందెలు పట్టే కష్టం లేకుండా చేసి, మహిళల కష్టాలు తీర్చింది కేసీఆర్. రైతుబంధు ఎందుకు వేయలేదు అంటే ఎలక్షన్ అయ్యాక ఇస్తా అంటున్నాడు రేవంత్. కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ 11 సార్లు రైతుబంధు ఆపలేదు. ఇంటింటికీ బియ్యం, మందులు పంపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక ఇప్పటికీ రెండు రైతుబంధులు ఎగ్గొట్టిండు. ఇది మూడోది. ఎగ్గొట్టిన రెండు, ఇప్పుడు రావాల్సిన ఒకటి కలిపి మూడు రైతుబంధులు వెంటనే వేయాలని డిమాండ్ చేస్తున్నాం. కావాలంటే మాకు అభ్యంతరం లేదని ఎలక్షన్ కమిషన్‌కు మేమే లేఖ ఇస్తాం. 11వ తేదీలోగా రైతుబంధు వేయకపోతే రైతులు నిన్ను చీల్చి చెండాడుతారు' అని హరీష్‌రావు హెచ్చరించారు. 'త్యాగాలతో, ఆమరణ దీక్షతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు, తెలంగాణ జాతిపిత కేసీఆర్. రేవంత్ రెడ్డి నోరు తెరిస్తే చాలు బూతులు మాట్లాడే బూతుల పిత. ఎంతో కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను రేవంత్ రెడ్డి ఆగమాగం చేస్తుండు.
సర్వనాశనం చేసిండు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి.. పెన్షన్ అడిగితే లాగుల తొండలు వదులుతా, హామీలు అడిగితే పేగులు మెడలో వేసుకుంటా అంటాడు. హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి వచ్చానని చెప్పుకునే రేవంత్ రెడ్డి బుద్ధి.. కుక్క తోక వంకర అన్నట్టే ఉంది. గతంలో రూ. 200 ఉన్న పెన్షన్‌ను రూ.2000 చేసింది కేసీఆర్. రేవంత్ రెడ్డి రూ.4000 ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి సగం కాలం గడిచినా ఒక్క రూపాయి పెంచలేదు. ఇప్పటివరకు ఒక్కో అవ్వతాతకు రూ.52,000 ప్రభుత్వం బాకీ పడింది' అని చెప్పారు. 'మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్నాడు. ఎవరికైనా వచ్చిందా..? ఫ్రీ బస్సు అని మగోళ్లకు డబుల్ టికెట్ కొట్టి, ఆడవాళ్లకు తిప్పలు పెట్టారు. పువ్వు గుర్తు వాళ్ళు ఎన్నడైనా ఒక్క రూపాయి పని చేశారా..? అక్షింతలు పంచడం తప్ప ఏమైనా చేశారా..? యాదాద్రి నరసింహ స్వామి గుడి కట్టింది కేసీఆర్. గజ్వేల్ వెంకటేశ్వర స్వామి గుడి, రామాలయం, శివాలయం అద్భుతంగా కట్టించింది కేసీఆర్. పనిచేసే వాళ్లకు ఓటేద్దామా..? అక్షింతలు వేసే వాళ్లకు ఓటేద్దామా..?
కేసీఆర్ ముస్లిం మైనార్టీ పిల్లల చదువు కోసం ఆలోచించి రెసిడెన్షియల్ స్కూల్స్ పెట్టారు. షాదీ ముబారక్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి వచ్చాక మైనార్టీల కోసం ఒక్క రూపాయి పనిచేశారా..? ఎరువు బస్తాలు ఇచ్చే తెలివి లేదు. చేతగాని దద్దమ్మ రేవంత్ రెడ్డి' అని హరీష్‌రావు మండిపడ్డారు. 'రేవంత్‌రెడ్డీ నువ్వు కేసీఆర్‌ని తిడతావా..? నీ మొఖానికి పండిన వడ్లు కొనే తెలివిలేదు.

## బెంగళూరు X ఢిల్లీ
## డబ్ల్యూపీఎల్‌లో నేడు ఫైనల్

నెల రోజులుగా క్రికెట్ అభిమానులను అలరిస్తున్న ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) చివరి అంకానికి చేరింది. ఆరంభం నుంచి వరుస విజయాలతో అందరికంటే ముందుగా ఫైనల్ బెర్తును ఖాయం చేసుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)ను టోర్నీ చరిత్రలో రికార్డు స్థాయిలో వరుసగా నాలుగోసారి ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్ ఢీకొననుంది. ఆర్‌సీబీ ఇదివరకే 2024లో ఇదే ఢిల్లీని ఓడించి టైటిల్ నెగ్గి ఈ సీజన్‌లోనూ అదే మ్యాజిక్‌తో రెండో ట్రోఫీని ఖాతాలో వేసుకోవాలని భావిస్తున్నది. మరోవైపు మూడుసార్లు ఫైనల్ చేరినా రన్నరప్‌తో సరిపెట్టుకున్న ఢిల్లీ.. కొత్త సారథి జెమీమా రోడ్రిగ్స్ సారథ్యంలో ఈసారైనా ఆ గండాన్ని అధిగమించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నది. మరి బెంగళూరుకు 'డబుల్' ఆనందం దక్కుతుందో? లేక క్యాపిటల్స్ కల నెరవేరుతుందో? చూడాలి. నేటి రాత్రి 7 గంటల నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో చూడొచ్చు.





## గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఊరట

రాష్ట్రంలో గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గ్రూప్-1 నియామకాలపై గతంలో సింగిల్ బెంచ్ విధించిన స్టేను సీజేఐ ధర్మాసనం కొట్టివేసింది. గురువారం విచారణలో ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. గ్రూప్-1 నియామకాలు సక్రమమేనని, పరీక్ష పారదర్శకంగానే జరిగిందని తేల్చి చెప్పింది. పరీక్షలో అవకతవకలు జరిగినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని హైకోర్టు స్పష్టం చేసింది. మొత్తం 563 మంది అభ్యర్థులు ఇప్పటికే అపాయింట్‌మెంట్ లెటర్లు అందుకోగా, ఈ తీర్పుతో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఊరట లభించింది. కాగా, గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, కరెక్షన్, బయోమెట్రిక్ నిబంధనల అమలులో లోపాలు ఉన్నాయంటూ పలువురు అభ్యర్థులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ బెంచ్ ధర్మాసనం గ్రూప్-1 ఫలితాలను రద్దు చేస్తూ సంచలన తీర్పునిచ్చింది. అంతేకాకుండా, జవాబు పత్రాలను తిరిగి మూల్యాంకనం చేయాలని లేదా అవసరమైతే పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఆదేశిస్తూ అప్పట్లో నియామకాలపై స్టే విధించింది. తర్వాత సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ , ఎంపికైన అభ్యర్థులు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఈ క్రమంలోనే సీజేఐ ధర్మాసనం సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రభుత్వం ఎంపికైన 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేసింది. అయితే, ఈ నియామకాలు కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని ధర్మాసనం అప్పుడే స్పష్టం చేసింది. గురువారం వెలువడిన తుది తీర్పుతో 562 మంది గ్రూప్-1 అభ్యర్థులు త్వరలోనే పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు.

హైకోర్టు తీర్పుపై సీఎం రేవంత్ హర్షం

గ్రూప్-1 పరీక్ష నియామకాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. గ్రూప్ -1 నియామకాలపై హైకోర్టు తీర్పును హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నానని అన్నారు. ఎవరు, ఎన్ని కుట్రలు చేసినా.. ఉద్యోగ నియామకాలను అడ్డుకోవాలని చూసినా వారి కుట్రలు, కుతంత్రాలను ఛేదించి న్యాయ పోరాటంలో విజయం సాధించామని పేర్కొన్నారు. న్యాయస్థానం తీర్పు నేపథ్యంలో 563 మంది గ్రూప్ -1 అభ్యర్థులకు అభినందనలు తెలియజేస్తున్నానని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారి గ్రూప్ -1 అధికారులుగా మీరు నియమితులయ్యారని, ఇక రాష్ట్ర పునర్ నిర్మాణానికి పునరంకితం కావాలని పిలుపునిస్తున్నాను.







## విలువలు ముఖ్యం: సమంత


నటి సమంత తాజాగా సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటిస్తూ విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం, జీవిత విలువలను అలవర్చుకోవాలని సూచించారు. తాను పాఠశాలలో నేర్చుకున్న స్నేహం, దయ, సానుభూతి వంటి లక్షణాలే జీవితంలో ఉపయోగపడ్డాయని తెలిపారు. 2023లో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగాయని, మహారాష్ట్రలో అత్యధిక కేసులు నమోదయ్యాయని తెలిపే వార్తను పంచుకుని విచారం వ్యక్తం చేశారు. తన కొత్త తెలుగు సినిమా షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభం కానుందని శుభవార్త అందించారు.

## 5 తేజస్ మార్క్1-ఏ యుద్ధ విమానాలు రెడీ



మిలిటరీ విమానాల ఉత్పత్తి సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఇవాళ కీలక ప్రకటన చేసింది. అయిదు తేజస్ మార్క్1-ఏ ఫైటర్ విమానాలు సంపూర్ణంగా సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నది. భారతీయ వైమానిక దళం కోసం ఈ యుద్ధ విమానాలను ఉత్పత్తి చేశారు. అయితే ఫ్యాక్టరీలో మరో 9 విమానాలు రెడీగా ఉన్నాయని, అమెరికా జనరల్ ఎలక్ట్రిక్ సంస్థ సరఫరా చేసే ఇంజిన్ల కోసం ఎదురుచూస్తున్నట్లు హెచ్ఏఎల్ తన ప్రకటనలో చెప్పింది. డెలివరీ కోసం అయిదు విమానాలు రెడీ అయ్యాయని, ఒప్పందం ప్రకారం ఆ విమానాలను రూపొందించామని, అదనంగా 9 విమానాలను నిర్మించామని, అమెరికా ఇంజిన్ల కోసం ఎదురుచూస్తున్న బెంగుళూరుకు చెందిన హిందుస్తాన్ ఏరోనాటిక్స్ కంపెనీ వెల్లడించింది. జీఈ సంస్థ నుంచి అనుకున్న తేదీ ప్రకారం అయిదు ఇంజిన్లు అందినట్లు హెచ్ఏఎల్ చెప్పింది. ఎఫ్404 ఇంజిన్ల సరఫరాలో ఆలస్యం వల్ల తేజస్ మార్క్ 1ఏ జెట్ల డెలివరీ ఆలస్యమైనట్లు పేర్కొన్నది. భారతీయ వైమానిక దళం కోసం హెచ్ఏఎల్ సంస్థ 180 యుద్ధ విమానాలను ఉత్పత్తి చేస్తున్నది. వాస్తవానికి మార్చి 2024 నాటికి ఆ విమానాల డెలివరీ ప్రక్రియ స్టార్ట్ కావాల్సి ఉంది. కానీ ఇంజిన్ల సరఫరాలో ఆలస్యం వల్ల .. విమానాల ఉత్పత్తిలో జాప్యం జరిగినట్లు కంపెనీ పేర్కొన్నది.

## 'దో దీవానే షెహర్ మే' ట్రైలర్ రిలీజ్




బాలీవుడ్ స్టార్ నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో సిద్ధాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'దో దీవానే షెహర్ మే'. ఈ చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా చిత్రయూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. అరేంజ్డ్ మ్యారేజ్ సెటప్‌లో కలిసిన ఇద్దరు వ్యక్తులు (శశాంక్ మరియు రోష్ని) మధ్య చిగురించిన ప్రేమ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. శశాంక్ (సిద్ధాంత్) తన ఉచ్చారణ సమస్యలతో ఇబ్బంది పడుతుంటే, రోష్ని (మృణాల్) తన అందం విషయంలో బాధపడుతూ ఉంటుంది. ఇద్దరు అసంపూర్ణమైన వ్యక్తులు ఒకరినొకరు ఎలా అర్థం చేసుకున్నారనేదే ఈ సినిమా. నేటి తరం యువత ప్రస్తుతం ఎదుర్కొంటున్న అభద్రతా భావం, ఒత్తిడి, నిజమైన ప్రేమ వెతుకులాటను ప్రతిబింబించేలా ఈ సినిమాను దర్శకుడు రవి ఉద్యవార్ తెరకెక్కించాడు. తెలుగులో 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాతోనే బాలీవుడ్‌కు పరిచయం అవుతుండటం విశేషం. భన్సాలీ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో ఇలా అరుణ్, జాయ్ సేన్ గుప్తా కీలక పాత్రలు పోషించారు.

## ఇషా పసిడి ధమాకా




కొత్త సీజన్‌ను భారత షూటర్లు ఘనంగా ఆరంభించారు. ఢిల్లీలోని కర్ణిసేన షూటింగ్ రేంజ్‌లో బుధవారం నుంచి మొదలైన ఆసియా రైఫిల్, పిస్టోల్ చాంపియన్‌షిప్‌లో మొదటిరోజే పతకాల పంట పండించారు. హైదరాబాదీ యువ షూటర్ ఇషా సింగ్.. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టోల్ వ్యక్తిగత ఈవెంట్‌తో పాటు టీమ్ ఈవెంట్‌లోనూ సత్తాచాటి భారత్‌కు డబుల్ గోల్డ్ మెడల్స్ అందించడంలో కీలకపాత్ర పోషించింది. ముందుగా వ్యక్తిగత విభాగంలో నిరుటి ఫామ్‌ను కొనసాగిస్తూ ఫైనల్‌లో 239.8 పాయింట్లు స్కోరు చేసి పసిడి కొట్టింది. చైనీస్ తైపీ షూటర్లు చెంగ్ యెన్-చింగ్ (235.4) రజతం నెగ్గగా యు ఐ-వెన్ (217.7) కాంస్యం సొంతం చేసుకుంది. సురుచి సింగ్ నాలుగో స్థానంలో నిలువగా డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ మనూ భాకర్ ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. ఇదే విభాగపు టీమ్ ఈవెంట్‌లో సురుచి, మనూ, ఇషా త్రయం 1,726 పాయింట్లతో స్వర్ణం గెలుచుకోగా వియత్నాం (1,713), చైనీస్ తైపీ (1,711) వరుసగా రజతం, కాంస్యం సాధించాయి.

EVENING EDITION
గురువారం | 05 ఫిబ్రవరి 2026
www.suryaa.com
4 PM
సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# ప్రియుడితో కలిసి భర్త హత్య



గత ఏడాది మేఘాలయలో జరిగిన హనీమూన్ మర్డర్ గురించి గుర్తుండే ఉంటుంది. మధ్య ప్రదేశ్‌కు చెందిన వ్యాపారవేత్త రాజా రఘువంశీని అతడి భార్య సోనమ్ ప్రియుడితో కలిసి హత్య చేసింది. పెళ్లైన నెల రోజుల్లోనే ఈ దారుణానికి పాల్పడింది. అచ్చం ఈ సంఘటనను తలపించేలా రాజస్థాన్‌లో ఓ మర్డర్ జరిగింది. పెళ్లైన కొన్ని నెలలకే ఓ యువతి దారుణానికి ఒడిగట్టింది. ప్రియుడితో కలిసి భర్తను చంపింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. శ్రీగంగానగర్‌కు చెందిన అంజు, సంజు ప్రేమించుకున్నారు. పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. అయితే, వీరి పెళ్లికి అంజు తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. అదే ప్రాంతానికి చెందిన ఆశిష్ అనే యువకుడితో మూడు నెలల క్రితం పెళ్లి చేశారు. పెళ్లి అయినా కూడా ఆమెకు ప్రియుడిపై ప్రేమ చావలేదు. ఇద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఆశిష్ బతికి ఉంటే తమ ప్రేమకు అడ్డుగా ఉంటాడని భావించి.. చంపి ఒక్కటవ్వాలని డిసైడ్ అయ్యారు. ఇందు కోసం పక్కా ప్లాన్ వేశారు. జనవరి 30వ తేదీన రాత్రి 9 గంటల ప్రాంతంలో ఆశిష్, అంజు భోజనం చేశారు. ప్లాన్ ప్రకారం అంజు తన భర్తను ఈవినింగ్ వాక్ అని చెప్పి బయటకు తీసుకొచ్చింది. ఇద్దరూ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నారు. ప్లాన్ ప్రకారం సంజుతో పాటు మరో ఇద్దరు రోడ్డు పక్క పొదల్లో దాక్కున్నారు. ఆశిష్ అక్కడికి రాగానే పొదల్లోకి లాక్కెళ్లి విచక్షణా రహితంగా దాడి చేశారు. గొంతు నులిమి చంపేశారు. అంజు తన ఫోన్, బంగారు నగలు సంజుకు ఇచ్చేసింది. జరిగింది రోడ్డు ప్రమాదం అని నమ్మించేలా ఆశిష్‌ను రోడ్డుపై పడేశారు. ఇద్దరినీ వాహనం ఢీకొట్టిందని నమ్మించేలా అంజు కూడా భర్త పక్కన నేలపై పడిపోయింది. ముగ్గురు నిందితులు అక్కడినుంచి వెళ్లిపోయారు. అటు వైపు వచ్చిన వాహనదారులు రోడ్డుపై పడున్న వారిని చూశారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అక్కడికి వచ్చారు. ఆశిష్, అంజులను ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆశిష్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్లు గుర్తించారు. అంజుకు సాధారణ చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అంజును విచారించగా పొంతన లేని సమాధానాలు చెప్పింది. దీంతో పోలీసులకు ఆమెపై అనుమానం వచ్చింది. తమదైన శైలిలో విచారించగా మర్డర్ విషయం బయటపెట్టింది. పోలీసులు అంజుతో పాటు సంజును.. అతడికి సాయం చేసిన మరో ఇద్దరినీ అరెస్ట్ చేశారు.

### మూగ, చెవిటి యువతిపై అత్యాచారం..
## కన్నతండ్రే నిందితుడని తేల్చిన డీఎన్ఏ టెస్ట్



ముంబైలో అత్యంత అమానవీయ ఘటన చోటుచేసుకుంది. మూగ, చెవిటి యువతిపై అత్యాచారం జరిగింది. ఫలితంగా ఆ యువతి గర్భందాల్చగా.. నిందితుడిని గుర్తించేందుకు జరిపిన డీఎన్ఏ పరీక్షలో షాకింగ్ విషయం బయటపడింది. ఆ యువతి కన్నతండ్రే ఈ దారుణానికి పాల్పడ్డాడని తేలింది. బాధిత యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. ముంబైలోని కఫే పరేడ్ ఏరియాలో ఉండే మూగ, చెవిటి యువతి గతేడాది సెప్టెంబర్ లో అనారోగ్యానికి గురైంది. కడుపు నొప్పిగా ఉందంటూ యువతి సైగలతో నానమ్మకు చెప్పింది. దీంతో యువతిని ఆవిడ ఆసుపత్రికి తీసుకెళ్లింది. వైద్య పరీక్షల్లో యువతి ఐదు నెలల గర్భవతిగా తేలడంతో డాక్టర్లు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అయితే, కేసు పెట్టేందుకు యువతి కానీ, ఆమె తండ్రి కానీ ముందుకు రాలేదు. యువతికి కౌన్సెలింగ్ ఇచ్చి ఫిర్యాదు తీసుకున్న పోలీసులు.. ఓ 17 ఏళ్ల బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. మరో 16 మందిని అనుమానితులుగా తేల్చారు. వీరిలో యువతిపై అత్యాచారం జరిపింది ఎవరనేది నిర్ధారించేందుకు డీఎన్ఏ పరీక్ష నిర్వహించాల్సిందిగా వైద్యులను ఆశ్రయించారు. యువతి తండ్రి సహా మొత్తం 17 మంది డీఎన్ఏను యువతి గర్భంలో పెరుగుతున్న పసికందు డీఎన్ఏతో పోల్చిచూడగా.. యువతి కన్నతండ్రి డీఎన్ఏ ఒక్కటే మ్యాచ్ అయింది. దీంతో యువతిపై అత్యాచారం జరిపి ఆమెను గర్భవతిగా చేసిన నిందితుడు కన్నతండ్రేనని స్పష్టమైంది. యువతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## ఖర్గే, నడ్డా మధ్య వాగ్వాదం

ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే, కేంద్ర మంత్రి జేపీ నడ్డా మధ్య పార్లమెంటరీ విధానంపై రాజ్యసభలో తీవ్ర వాగ్వాదం జరిగింది. బుధవారం లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేయాల్సిన ప్రసంగం ఆగిపోయిన సంగతి తెలిసిందే. గురువారం రాజ్యసభలో కూడా అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య మాటల యుద్ధం మొదలైంది. పార్లమెంటులో జాతీయ ప్రయోజన అంశాల గురించి మాట్లాడటంపై ఆంక్షలు విధిస్తున్నారని ఖర్గే ఆరోపించడంపై కేంద్ర మంత్రి జేపీ నడ్డా అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంట్ అంటే లోక్ సభ, రాజ్యసభ రెండూ ఉంటాయి. లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు దేశ ప్రయోజనాల గురించి మాట్లాడాలనుకున్నారు. కానీ అలా చేయడానికి ప్రభుత్వం అనుమతించలేదు. మీరు సభను ఇలా ఎలా నడపగలరు' అని ఖర్గే ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు జేపీ నడ్డా స్పందిస్తూ.. 'లోక్‌సభ కార్యకలాపాలను రాజ్యసభలో చర్చించలేము.

## టీటీడీ నెయ్యి టెండర్‌లో అక్రమాలు.. పయ్యావుల షాకింగ్ కామెంట్స్



శ్రీవారి లడ్డూ కల్తీ విషయంలో అనుమానాలపై వాస్తవాలు చెబుతున్నామని ఏపీ ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. వేంకటేశ్వర స్వామి లడ్డూ గట్టిగా ఉందని, సువాసన లేదని భక్తులు గతంలో తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అప్పటి ఈవో ధర్మారెడ్డికి పోటు కార్మికులు చెపితే.. ఆర్గానిక్ నెయ్యి అలానే ఉంటుందని చెప్పారని ప్రస్తావించారు. ఈవో తన విధి నిర్వహణలో భాగంగా NDDBకి శాంపిల్స్ పంపారని గుర్తు చేశారు. NDDB రిపోర్టుతో అందరు నివ్వెరపోయారన్నారు. S వ్యాల్యూలో తేడాతో కల్తీ జరిగినట్లుగా నివేదిక వచ్చిందని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. గురువారం ఆయన అమరాతి సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఆ విషయాలను ప్రజల ముందు పెట్టారని, నాటి రిపోర్టును వివరించారని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 'ఈ కల్తీ వ్యవహారాన్ని తేల్చడానికి సిట్‌ను ఏర్పాటు చేశాం. దీనిలో మరో ఇద్దరు అధికారులను యాడ్ చేసి సీబీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేయాలని నిర్ణయించారు. టీటీడీలో ఇలాంటివి భవిష్యత్తులో జరగకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కటీ తెలిసే జరిగింది. తెలియక కాదు... సీఎఫ్టీఆర్ఐ కూడా మరో నివేదిక ఇచ్చింది. బెటాసిస్టో స్టిరాయ్ దీనిలో ఉన్నట్లు పేర్కొంది. ఇంత తెలిసిన తర్వాత కూడా టీటీడీ మాజీ చైర్మన్ ఈ విషయాన్ని తొక్కిపెట్టారు. 60 లక్షల లీటర్లు కల్తీ నెయ్యి సరఫరా చేశారు, రూ.234 కోట్లు దుర్వినియోగమైంది' అని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. చిన్న అప్పన్న బోలేబాబా డెయిరీ దగ్గరకు వెళ్లి ఈ టెండర్ ఇవ్వాలని కోరారని.. వారు అంగీకరించలేదని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. 'వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. తర్వాత కూడా వారి సంస్థను తీసుకోవడం కుదరదని.. ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీల ద్వారా సరఫరా చేయించారు. కిలోకు రూ.35లు నష్టానికి వారు సరఫరా చేశారు. ఇది వారికి ఎలా సాధ్యమైందో ఆలోచించాలి. రూ.320లకు నెయ్యి ఎలా ఇచ్చారు... బోలే బాబా అనే సంస్థ నెయ్యి అని పిలువబడే నెయ్యిని తయారు చేశారు. ఫామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్‌ను నెయ్యి వాసన వచ్చేలా, రంగువచ్చేలా తయారు చేశారు. బోలేబాబాలో పదిమంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. వీరిలో స్వీపర్లు, వాచ్‌మెన్‌లు కాకుండా ఆరుగురు ఉన్నారు' అని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

## దిగొచ్చిన చికెన్ ధరలు



గత నెల రోజులుగా సామాన్యుడికి చుక్కలు చూపించిన కోడిమాంసం ధరలు ఎట్టకేలకు దిగివచ్చాయి. పండగలు, తీర్థాల సీజన్‌లో 'ట్రిపుల్ సెంచరీ' మార్కును తాకిన చికెన్ ధర, గత పది రోజులుగా క్రమంగా తగ్గుముఖం పడుతుండటం వినియోగదారులకు పెద్ద ఊరటనిస్తోంది. ప్రస్తుతం సరఫరా పెరగడం, అదే సమయంలో వినియోగం కొంత మేర తగ్గడంతో మార్కెట్ సాధారణ స్థితికి చేరుకుంటోంది. నెల క్రితం వరకు కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ. 300 దాటగా, ఇప్పుడు అది ప్రాంతాన్ని బట్టి రూ. 220 నుంచి రూ. 250 మధ్యకు చేరింది. లైవ్ కోడి ధర సైతం కిలో రూ. 140 వద్ద నిలకడగా కొనసాగుతోంది. పౌల్ట్రీ ఫారాల్లో ప్రస్తుతం కోళ్ల ఉత్పత్తి ఆశాజనకంగా ఉండటం, డిమాండ్‌కు మించి లభ్యత ఉండటమే ఈ ధరల తగ్గుదలకు ప్రధాన కారణమని వ్యాపార వర్గాలు విశ్లేషిస్తున్నాయి. హోటళ్లు, ఫంక్షన్ల నుంచి ఆర్డర్లు సాధారణంగా ఉన్నప్పటికీ, గృహ అవసరాల కోసం కొనేవారి సంఖ్య కొంత తగ్గడం కూడా ధరలపై ప్రభావం చూపింది. కేవలం మాంసం మాత్రమే కాకుండా, గతంలో ఎన్నడూ లేని విధంగా కిలో రూ. 9కి చేరిన కోడిగుడ్డు ధర కూడా ఇప్పుడు రూ. 6కు పడిపోయింది. పౌల్ట్రీ యజమానుల అంచనా ప్రకారం.. రాబోయే రోజుల్లో ఉత్పత్తి మరిన్ని రెట్లు పెరిగే అవకాశం ఉండటంతో, ధరలు ఇంకా తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. చేపలు, మటన్ ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో, సామాన్యుడికి అందుబాటులో ఉండే ఏకైక నాన్-వెజ్ వనరు చికెన్ మళ్లీ అందుబాటులోకి రావడం విశేషం.



### మేడారంలో లైంగిక దాడి ఆరోపణలపై
## ఎన్‌సీడబ్ల్యూ సీరియస్

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో మైనర్ బాలికపై అత్యాచారం జరిగినట్లుగా వస్తున్న వార్తలపై జాతీయ మహిళా కమిషన్ స్పందించింది. ఈ అమానుష ఘటనను కమిషన్ సుమోటోగా స్వీకరిస్తూ కేసు నమోదు చేసింది. అంతే కాకుండా, నిజనిజాలను తేల్చేందుకు జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ విజయ రహాత్కర్ ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలు డెలినా ఖోంగ్డుప్ అధ్యక్షత వహించగా, ఎన్‌సీడబ్ల్యూ సీనియర్ కోఆర్డినేటర్ కంచన్ ఖట్టర్ సభ్యురాలిగా వ్యవహరించారు. కమిటీకి సహకరించేందుకు న్యాయవాదిని నియమించాలని ములుగు జిల్లా న్యాయసేవాధికార సంస్థకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం నుంచే విచారణ ప్రారంభించాలని కమిటీని కమిషన్ చైర్‌పర్సన్ ఆదేశించగా..ఆ కమిటీ వచ్చి ఘటన జరిగిన పరిస్థితులను పరిశీలించడం, స్థానిక అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించడం, ఇప్పటి వరకు పోలీసులు తీసుకున్న చర్యలను కమిటీ పర్యవేక్షించారు.



### పిచ్చెక్కిస్తున్న
## నేషనల్ క్రష్

ఈ ఫొటో షూట్ లో రష్మిక సంప్రదాయానికి ఆధునికతను జోడించి ఎంతో అందంగా కనిపించింది. ఆమె నాజూకు నడుమందాలు నెటిజన్లను ఫిదా చేస్తున్నాయి. ప్రతీ ఫొటో అందానికి పరాకాష్ట అన్నట్లుగా ఉంది. రష్మిక తన జుట్టును ముడివేసి.. పువ్వులతో అలంకరించడం సంప్రదాయ లుక్ ను జోడించింది. ప్రస్తుతం రష్మిక తన లేటెస్ట్ మూవీ 'థామా' మూవీ ప్రమోషన్స్ లో బిజీగా ఉంది. ఇందులో భాగంగానే గ్లామరస్ గా ముస్తాబైన ఫొటో షూట్ షేర్ చేసింది ఈ ముద్దుగుమ్మ. 'గీతా గోవిందం' సినిమాతో కుర్రాళ్ళ హృదయాలను కొల్లగొట్టిన రష్మిక.. వరుస సినిమాలు చేస్తూ కెరీర్ లో సక్సెస్ ఫుల్ గా రాణిస్తోంది.

## విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికో మృతి




విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో విధినిర్వహణలో ఉన్న ఓ మెడికో అనుమానాస్పద రీతిలో మరణించింది. విధుల్లో ఉండగానే కడుపునొప్పితో బాధపడుతున్నట్లు చెప్పడంతో మరో వైద్య విద్యార్థిని ఇంజెక్షన్ చేసింది. ఆ తర్వాత ఆపరేషన్ గదిలో విద్యార్థిని మరణించినట్లు గుర్తించిన సహచరులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం జిల్లాకు చెందిన దీపిక ఎంబీబీఎస్ పూర్తిచేసి అనస్తీషియా విభాగంలో పీజీ చేస్తోంది. విజయవాడ వైద్య కళాశాలలో చదువుతున్న దీపిక.. విధుల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఆసుపత్రికి వచ్చింది. సాయంత్రం 4 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు ఆమె డ్యూటీ చేయాల్సి ఉంది. అయితే, బుధవారం సాయంత్రం డ్యూటీకి వచ్చిన కాసేపటికే కడుపునొప్పిగా ఉందని తోటి వైద్య విద్యార్థులకు చెప్పింది. దీంతో ఓ విద్యార్థిని ఆమెకు ఇంజెక్షన్ చేసింది. ఆ తర్వాత విధుల్లో నిమగ్నమైన దీపిక రాత్రి 11.30 గంటల సమయంలో ఆపరేషన్ గదిలో బల్లపై పడిపోయింది. వెంటనే ఆమెను పరీక్షించిన సహచరులు.. దీపిక అప్పటికే మరణించిందని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో కలిసి సీసీ కెమెరాలను పరిశీలించారు. దీపిక ఆత్మహత్యకు పాల్పడిందా లేక మరేదైనా కారణమా అనేది తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు. దీపికది అనుమానాస్పద మరణంగా భావిస్తున్నామని, అనంతపురం నుంచి ఆమె తల్లిదండ్రులు వచ్చాక వారి ఫిర్యాదుతో దర్యాప్తు జరుపుతామని చెప్పారు. వైద్య విద్యార్థిని దీపిక మరణంపై మంత్రి సత్యకుమార్ విచారం వ్యక్తం చేశారు. మృతురాలి తండ్రితో ఫోన్ లో మాట్లాడి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చినట్లు సమాచారం.